




ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 56 తిరుపతి తేది : గురువారం 28 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS




## ఈడీ రాజకీయ దాడి

- కేరళం మాజీ సీఎం పినరయి ఇంటిపైకి
- ఉసిగొల్పిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
- మనీలాండరింగ్ అంటూ నిరాధార ఆరోపణలు
- ఆయన అల్లుడితో పాటు మరో పదిమంది ఇండ్లపైనా దాడులు
- భగ్గుమన్న కేరళం - తీవ్రంగా ప్రతిఘటించిన ప్రజలు
- 'ఈడీ గో బ్యాక్' అంటూ నినాదాలు
- రోడ్లపైకి వచ్చి నిరసనలు, ఆందోళనలు
  రాజకీయ దురుద్దేశంతోనే : సీపీఐ(ఎం)

**తిరువనంతపురం/న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 27**

కేరళంలో బీజేపీ, కాంగ్రెస్ అపవిత్ర కలయిక బట్టబయలైంది. ఇద్దరూ కలిసి మాజీ సీఎం పినరయి విజయన్ కుటుంబాన్ని టార్గెట్ చేశారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పార్టీ అధికారంలోకి రాగానే, కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కై అర్థంపర్థం లేని ఓ పాత కేసులో మనీ లాండరింగ్ అంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను బుధవారం ఉదయం విజయన్ ఇంటిపైకి ఉసిగొల్పారు. విజయన్‌తో పాటు ఆయన సన్నిహితులకు చెందిన మరో పది చోట్లకూడా ఏకకాలంలో దాడులు చేయించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఈడీ దాడులపై కాంగ్రెస్, బీజేపీ నేతలు బహిరంగంగానే సీపీఐ(ఎం)కు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కేరళం ప్రచారానికి వెళ్లి, పినరయి విజయన్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేసివచ్చారు. తాజాగా కాంగ్రెస్, బీజేపీల సంయుక్త డైరెక్ష?న్‌లో ఈ దాడులు జరిగాయి. ఈ విషయం తెలియగానే కేరళం ప్రజానీకం భగ్గుమంది. విజయన్‌కు అండగా నిలిచింది. వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా ఆయన ఇంటికి చేరుకున్నారు. గేటు ముందు బైఠాయించి, 'ఈడీ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. కేంద్ర భద్రతా బలగాల పహారాలో దాడులకు వచ్చిన ఈడీ అధికారుల్ని ఓ దశలో నిర్బంధించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలు ఓవర్‌యాక్షన్ చేశాయి. దీంతో కొందరు ఆందోళనకారులు ఈడీ అధికారుల కార్లపై రాళ్లు విసిరారు. ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలిపారు. కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిరువనంతపురంలోని బేకరి జంక్ష?న్ వద్ద అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఈడీ అధికారులు ఆ ఇంటిపైనే దాడులు చేశారు.

ఆ సమయంలో ఇంట్లో విజయన్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు కూడా ఉన్నారు. అధికారుల దాడులకు మాజీ సీఎం కుటుంబం సంపూర్ణంగా సహకరించింది. అన్ని గదుల్లోకి ఈడీ అధికారుల్ని తీసుకెళ్లి, సోదాలు చేసుకోమని స్వేచ్ఛగా వదిలేశారు. ఇక కేసు విషయంలోకి

- మిగతా 2లో..



# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి...

- గత ప్రభుత్వ పాలనపై మహానాడులో సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి, టీడీపీకి పోలికే లేదన్న పార్టీ అధినేత
- వారిది విధ్వంసమైతే మనది అభివృద్ధి అని వ్యాఖ్య
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేశామని వెల్లడి
- విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని హామీ
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఆరోగ్యకర, సంపన్న, సంతోష ఏపీ నిర్మాణమే కూటమి లక్ష్యమన్న సీఎం

**అమరావతి – ఆంధ్రనాడు, మే 27**

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వారిది విధ్వంసకర పాలన అయితే, తమది అభివృద్ధి మంత్ర మని స్పష్టం చేశారు. పేదలకు కావాల్సింది సంక్షేమమే తప్ప గొడ్డలివేట్లు కాదని, యువతకు ఉద్యో గాలు కావాలి కానీ గొడ్డలిపోట్లు కాదని ఘాటుగా వ్యాఖ్యానిం చారు. "వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారడం వారి విధానం. ఐటీ నుంచి క్వాంటం వైపు ఎదగడం మన విధానం. బోత్ ఆర్ నాట్ సేమ్" అంటూ టీడీపీ, వైసీపీల మధ్య ఉన్న తేడాను వివరించారు. గొడ్డలి పార్టీ చేసే కుయుక్తులకు భయపడబోమని, ఎన్ని ప్రయత్నాలు చేసినా టీడీపీని అడ్డుకోలేరని హెచ్చరించారు.



**గత ప్రభుత్వ వైఫల్యాలు.. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కి వెళ్లిపోయిందని చంద్రబాబు ఆరోపించారు. "విశాఖలో రైల్వే జోన్ కోసం కనీసం 52 ఎకరాల భూమిని కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం వారిది. కూటమి అధికారంలోకి వచ్చాకే రైల్వే జోన్‌ను సాధించుకున్నాం" అని తెలిపారు. గత పాలకులు రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని, డిస్కమ్‌లను రూ.1.35 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచబోమని మాటిచ్చామని, ఇప్పుడు కూడా అదే మాట మీద ఉన్నామని, తొలిసారిగా విద్యుత్ ఛార్జీలకు సంబంధించి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గుంతలు పడ్డ రోడ్లను బాగుచేయడంతో పాటు, 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని వివరించారు.

**ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు..**

భూ వివాదాలకు కారణమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని, రికార్డులు ట్యాంపర్ కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకున్నామని చంద్రబాబు వెల్లడించారు. నాలా యాక్టును కూడా రద్దు చేసి, ఇప్పుడు రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఏర్పడిన ఇంధన కొరత, ఆక్వా రంగ సంక్షోభాన్ని పరిష్కరించే

- మిగతా 2లో..

# రుయా ఆసుపత్రిలో తాగుబోతు

- అధికారులకు బెదిరింపులు...
- తోటి మహిళా వైద్య సిబ్బంది ఇబ్బందుల్లోకి
- స్పందించని సూపరెంటెండెంట్...



**తిరుపతి – ఆంధ్రనాడు :**

రాయలసీమకే తలమానికమై ప్రభుత్వం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా రోగులకు సేవలు అందిస్తోంది తిరుపతి రుయా ఆసుపత్రి. వందలాది మంది వైద్య సిబ్బందితో ప్రతి నిత్యం వేలాది మంది రోగులకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తోంది, ఇంతటి ఘన కీర్తి కలిగిన రుయా ఓ ఉద్యోగి ప్రవర్తన కారణంగా అప్రదిష్ట మూటగట్టుకుంటోంది. ఆ ఉద్యోగిని వెనకేసుకొస్తున్న ఉన్నతాధికార యంత్రాంగం తమ జేబులు నింపుకోవడానికి రుయా పరువును గంగలో కలుపుతున్నారు. రుయా స్థాపించబడినప్పటి నుండి ఇప్పటి వరుకు ఎంతో మంది వైద్యులు నిరుపేదలకు వైద్యం చేసి పుణ్యఫలం మూటగట్టుకుంటే ప్రస్తుత వైద్యాధికారులు మాత్రం తమ నడవడికతో రోగులను ఇబ్బందులకు గురి చేస్తూ రుయా ప్రస్థానాన్ని అధఃపాతాళానికి తోక్కేస్తున్నారు. రేడియాలజీ విభాగం లోని ఓ ఉద్యోగి మద్యానికి బానిసై కన్నూ మిన్నూ తెలియకుండా విధులు నిర్వహిస్తూ అటు రోగులకు ఇటు మహిళా వైద్య సిబ్బందికి సమస్యలు తెస్తూ ఇబందులకు గురి చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ అంశంపై సూపరెంటెండెంట్ కు ఫిర్యాదులు అందినా, చర్యలు తీసుకోవడంలో ఆయన ఎందుకు విఫలమయ్యారో తెలియాల్సి ఉంది.

**రేడియాలజీ విభాగం -- అవాంఛనీయ సంఘటనల వేదిక:**

రుయాలోని రేడియాలజీ విభాగం అవాంఛనీయ సంఘటనల వేదిక గా మారింది. గతంలో ఇదే విభాగం లోని ఓ ఉద్యోగి పారా మెడికల్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించి రుయాకు అపకీర్తి తెచ్చిపెట్టారు. విశాఖ కమిటీ విచారణ సైతం ఎదుర్కొన్నారు. ప్రస్తుతం మద్యానికి బానిసైన

- మిగతా 2లో..

## నీది టెన్త్ పేపర్ కొట్టేసిన హిస్టరీ..
## నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ

- మూడు అక్షరాల బ్రాండ్ సీబీఎన్ అన్న లోకేశ్
- భవిష్యత్తును ముందుగానే చూసే లీడర్ చంద్రబాబు అని కితాబు
- గొడ్డలి పార్టీ అంటే సైకోకి కోపం వచ్చిందట అని ఎద్దేవా
- ఇకపై ప్రతి ఎన్నికలో మనమే గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మన బలమని వ్యాఖ్య

**అమరావతి – ఆంధ్రనాడు, మే 27**



తెలుగుదేశం పార్టీ పండుగలా జరుపుకునే మహానాడు వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో హైబ్రిడ్ మోడల్ లో వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు. విజనరీ లీడర్ సీబీఎన్ అని కొనియాడారు. "ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మూడు అక్షరాలు చెబితే గౌరవం దక్కుతుంది. ఆ మూడు అక్షరాల బ్రాండ్ సీబీఎన్. ఈ సౌండ్

- మిగతా 2లో..

2

ANDHRANADU
TELUGU DAILY

గురువారం
28.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం

ఆంధ్రనాడు

# ఈడీ రాజకీయ దాడి

(మొదటిపేజీ తరువాయి)

వస్తే 2017–21 మధ్య కాలంలో ఓ ప్రయివేటు మైనింగ్ కంపెనీ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నుంచి విజయన్ కుమార్తె, మాజీ ఐటీ కన్సల్టెంట్ టీ వీణ ఆమెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు అక్రమంగా రూ. 1.72 కోట్లు నగదు బదిలీచేశారనేది అభియోగం. ఈ ఆరోపణలను అప్పట్లోనే వీణ తీవ్రంగా ఖండించారు. రాజకీయ ప్రేరేపిత చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కానీ ఈ కేసును కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మొన్నటి ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకున్నాయి. మాజీ సీఎం విజయన్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేసి ఎన్నికల్లో లబ్ది పొందారు. ఈ కేసులో మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఎలాంటి ప్రత్యక్ష?, పరోక్ష? సంబంధాలు లేవని న్యాయస్థానాలు తేల్చిచెప్పాయి. అయినా సీపీఐ(ఎం) శ్రేణుల్ని భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా తాజాగా ఈ దాడులకు తెగబడ్డారు. విజయన్ అద్దె నివాసంతో పాటు కోజికోడ్‌లో ఉంటున్న ఆయన కుమార్తె వీణ, ఆమె భర్త, మాజీ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ నివాసంలో కూడా ఈడీ అధికారులు దాడులు చేశారు. అలాగే సీఎంఆర్ఎల్ కు చెందిన మరికొందరి ఇండ్లలో కూడా సోదాలు చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు**

ఈడీ దాడులపై వీణ భర్త రియాస్ స్పందిస్తూ ఈ దాడులు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమనీ, తన తుది శ్వాస విడిచే వరకూ సంఘ్ పరివార్‌పై పోరు కొనసాగిస్తానని చెప్పారు. 'మీరు నాపై అన్ని వైపుల నుంచి దాడి చేయవచ్చు. అయితే నేను సంఘ్ పరివార్ ముందు తలవంచను. తుది శ్వాస విడిచే వరకూ పోరాడుతూనే ఉంటా' అని ఆయన సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడుల విషయం తెలుసుకొని సీపీఐ (ఎం) కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కన్నూర్‌లోని పినరయి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ పార్టీ నేతలు, కార్యకర్తలు బైఠాయించారు. మాజీ మంత్రి వి.శివకుట్టి, ఎమ్మెల్యే వి.జాయ్, అనవూర్ నాగప్పన్, వీకే ప్రశాంత్, బినీష్ కొడియెరి సహా పలువురు నేతలు నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మరోవైపు ఏకేజీ సెంటర్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం అత్యవసరంగా సమావేశమైంది. అనంతరం రాజధానిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విజయన్ తదితరుల నివాసాలపై జరిగిన దాడులు కాంగ్రెస్–బీజేపీ ఉమ్మడి ఆపరేషన్‌లోనూ, వాటి కుటిల యత్నాలలోనూ భాగమేనని సీపీఐ (ఎం) సీనియర్ నేత పి.జయరాజన్ మండిపడ్డారు. కన్నూర్ లోని విజయన్ నివాసం ఎదుట ఆయన విలేకరు లతో మాట్లాడుతూ పిన రయి శాశ్వత, అద్దె ఇండ్లలో దాడులు జరిపారని, ఆయన అల్లుడు రియాస్ ఇంటిపై కూడా దాడి జరిగిందని చెప్పారు. 'ఇదంతా ఓ స్పష్టమైన పథకం ప్రకారం జరిగింది. పెద్ద కుట్రకు పాల్పడ్డారు. నిజమేమిటో ప్రజలు గ్రహిస్తారు' అని అన్నారు.

**మాకు సమాచారం లేదు : హోం మంత్రి చెన్నితల**

ఈడీ గాలింపు చర్యలపై రాష్ట్ర పోలీసులకు కానీ, తన మంత్రిత్వ శాఖకు కానీ ఎలాంటి ముందస్తు సమాచారం లేదని కేరళం హోం మంత్రి రమేష్ చెన్నితల చెప్పారు. ముఖ్యమంత్రి సతీశన్ ఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం. సోదాల నిర్వహణకు ఈడీ అధికారులు రాష్ట్ర పోలీసుల సహకారం కోరలేదని తెలిపారు.

## నీది టెన్త్ పేపర్ కొట్టేసిన హిస్టరీ..

# నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ

(మొదటిపేజీ తరువాయి)

తాడేపల్లి ప్యాలస్‌కు వినపడాలి.. టీమ్ 11 టీవీలో మహానాడు చూస్తుంది. ఒక్కరితో అయితే పోటీ పడగలం. కానీ ఆయనలో 25 ఏళ్ళ కుర్రాళ్లు ముగ్గురు ఉన్నారు. ఆయన జెట్ స్పీడ్‌లో వెళుతుంటారు. ఆయన స్పీడ్ అందుకోవడానికి మనం కష్టపడుతున్నాం. అప్పుడు కియా... ఇప్పుడు ఫైటర్ జెట్స్. అప్పుడు ఐటీ.. ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్... ఇప్పుడు అమరావతి. భవిష్యత్తును ముందుగానే చూసే విజనరీ మన లీడర్ సీబీఎన్. స్త్రీశక్తిని మహా శక్తిగా మార్చింది, మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, డ్వాక్రా ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది, తన తల్లి పడిన కష్టం మరే తల్లి పడకూడదని దీపం పథకం ప్రవేశపెట్టింది, మహిళలను బస్ కండక్టర్స్ చేసింది మన సీబీఎన్. దేశంలోనే మొదటి మహిళా స్పీకర్‌గా ప్రతిభా భారతిని నియమించింది మన సీబీఎన్. ఎవరైనా మహిళల జోలికి వస్తే అదే వారికి లాస్ట్ డేట్ అని చెప్పిన దమ్మున్న నాయకుడు మన సీబీఎన్" అని లోకేశ్ ఉద్ఘాటించారు.

తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత అని లోకేశ్ అన్నారు.. 2019 నుంచి 2024 వరకు పసుపు సైన్యం చేసిన పోరాటం ఒక చరిత్ర. మనం కొట్టిన దెబ్బకి వై నాట్ 175 కాస్తా టీమ్ 11 అయిందని ఎద్దేవా చేశారు. ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని -- అభివృద్ధి వికేంద్రీకరణ మన విధానమని చెప్పారు. దేశవ్యాప్తంగా వచ్చే పెట్టుబడుల్లో ఈరోజు 25 శాతం ఆంధ్రప్రదేశ్ కు వస్తున్నాయని తెలిపారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, ఫైటర్ జెట్ ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయని చెప్పారు. "గొడ్డలి పార్టీ అంటే సైకోకి కోపం వచ్చింది అంట. మాది గూగుల్ -- మీది గొడ్డలి. మాది ఫైటర్ జెట్స్ -- మీది ఫ్యాక్షన్. మాది కియా -- మీది కిడ్నాప్. బాబాయిని చంపింది గొడ్డలితో కాదా? తల్లిని ఇంటి నుండి బయటకు గెంటింది నిజం కాదా? చెల్లికి అన్యాయం చేసి ఆస్తులు కొట్టేసింది నిజం కాదా? అందుకే గొడ్డలి పార్టీ అంటున్నాం" అని చెప్పారు.

"నిజం గడప దాటే లోగాని అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంది. బాబాయిని చంపి కత్తి బాబుగారి చేతిలో పెట్టారు. వైసీపీ ఫేక్ ప్రొపగాండాను గట్టిగా తిప్పికొట్టాలి. ఇప్పుడు రోజుకో కుట్రతో వస్తున్నారు. సైకో... నీది టెన్త్ క్లాస్ పేపర్ కొట్టేసిన హిస్టరీ ... నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ. టీచర్లను లిక్కర్ షాప్ ముందు నిలబెట్టిన హిస్టరీ నీది... టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్ పంపిన హిస్టరీ నాది. 5 సంవత్సరాల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని హిస్టరీ నీది ... 16,347 టీచర్ పోస్టులు ఒక్కసారిగా భర్తీ చేసిన హిస్టరీ నాది. జాబ్ క్యాలెండర్ అని సాక్షి క్యాలెండర్ చేతిలో పెట్టిన హిస్టరీ నీది ... 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన హిస్టరీ నాది" అని జగన్ ను ఉద్దేశించి లోకేశ్ ఎద్దేవా చేశారు. ఇక నుంచి మనం గేర్ మార్చాలని, మిషన్ మోడ్‌లో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికలోనూ మనమే గెలవాలి, అదే మన గోల్ అని చెప్పారు. "ప్రజల్లోకి వెళదాం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి. అహంకారం వద్దు. అహంకారం చూపిన వారికి 151 కాస్తా 11 అవడం చూశాం. ప్రజలకు సేవ చేయడం మన ధ్యేయం. మనం అనుకున్నది సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం. ఒకే ప్రభుత్వం ఉండటం వల్లే గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మన బలం. మనకు నమో ఉన్నారు. నమో అంటే నాయుడు–మోదీ. వీరిద్దరితో కలిసి పవనన్న కాంబోతో పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు, అమరావతి, కర్నూల్ హైకోర్టు బెంచ్ సాధించాం" అని లోకేష్ పేర్కొన్నారు.

# రుయా ఆసుపత్రిలో తాగుబోతు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగి కూడా ఇదే రీతిలో సంస్థకు చెడ్డపేరు తెస్తున్నారు. గత ఆరు నెలలుగా సదరు ఉద్యోగి పై అధికారులు ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో ఈ విభాగం హెచ్ఓడి ఈయనపై తాగి విధులకు హాజర్యయారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే నిర్ణీత సమయానికి విధులకు హాజరు కావడం లేదని, రోగుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల కూడా అయన ప్రవర్తనా తీరుతో విసిగిపోయిన ఉద్యోగులు రాత పూర్వక ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం. ఫిర్యాదు చేసి రెండు వారాలు గడిచినా సూపరెంటెండెంట్ చర్యలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం తో ఫిర్యాదు చేసిన ఉద్యోగులు విస్తుపోతున్నారు.

**ఆయనతో పాటు మహిళా ఉద్యోగినులు**
**– పారా మెడికల్ విదార్థినులు రాత్రి పూట విధులు**

రేడియాలజీ విభాగంలో రాత్రి పూట విధులు నిర్వహించే ఉద్యోగులలో మహిళలు, పారా మెడికల్ విద్యార్థినులు సైతం ఉన్నారు. రుయా ఆసుపత్రి లో అన్ని విభాగాలకు కలిపి ఐదు శాశ్వత ఎక్స్ రే యూనిట్లు , రెండు మొబైల్ ఎక్స్ రే యూనిట్లు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి మొత్తం 18 మంది శాశ్వత ఉద్యోగులతో పాటు పారా మెడికల్ విద్యార్థులు ఉంటారు. ప్రతి నిత్యం ఒక్కో ఎక్స్ రే యూనిట్ కోసం ఒక శాశ్వత ఉద్యోగితో పాటు ఇద్దరు పారా మెడికల్ విద్యార్థులు కో - రేడియాగ్రాఫర్లు గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులకు పాత రొటేషన్ పద్దతిలో నాలుగు, కొత్త రొటేషన్ పద్దతిలో రెండు రాత్రి పూట షిఫ్టులు ఉంటాయి. ఈ లెక్కన ఈ మద్యపాన ఉద్యోగి రాత్రి పూట నిర్వహించే సమయంలో మహిళా సిబ్బంది పాట్లు అన్నీ ఇన్నీ కావని చెప్పాలా?. ఈ యన తన మద్యపాన సేవనం అలవాటు కోసం ఇతర ఉద్యోగుల రాత్రి పూట షిఫ్టను తనకు మార్చాలిందిగా కోరుతుంటారని ఇతర ఉద్యోగులు చెపుతూ ఉంటారు.

**ఉన్నతాధికారులకు బెదిరింపులా???...**
**లేక వసూళ్ల???....**

రాత పూర్వక ఫిర్యాదులు చేసిన అధికారుల పై సదరు ఉద్యోగి బెదిరింపులకు పాల్పడుతుండటంతో వారు చర్యలు చేపట్టడానికి వెనుకాడుతున్నట్లు సమాచారం. మరో కోణమేమిటంటే ఫిర్యాదు చేసిన ప్రతి సారి సదరు ఉద్యోగి నుండి భారీ మొత్తం లో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆలా వసూళ్లకు పాల్పడుతుండటం వల్లే ఆయన ఆటలు సాగుతున్నట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. మౌఖిక, రాత పూర్వక ఫిర్యాదులు ఎన్ని చేసినా ప్రయోజనం లేదని మహిళా ఉద్యోగినులు వాపోతున్నారు. దీనికి తోడు పారా మెడికల్ విద్యార్థులు సైతం ఆయన మద్యం అలవాటు కారణంగా అసౌకర్యానికి గురవుతు న్నారని చేసిన ఫిర్యాదులు పదుల కొద్దీ ఉన్నాయని తెలుస్తోంది.

**స్పందించని రుయా సూపరెంటెండెంట్.....**

రేడియాలజీ విభాగం హెచ్ఓడి లే రాత పూర్వకంగా చేసిన ఫిర్యాదులు సైతం బుట్ట దాఖలవుతుండటతో ఉద్యోగులు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వివరణ కోసం ఆంధ్రనాడు రుయా సూపరెంటెండెంట్ ను ఫోన్ లో సంప్రదించగా ఆ ఫోన్ ఎత్తక పోవడం కోసం మెరుపు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

(మొదటిపేజీ తరువాయి)

దిశగా చర్యలు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారు.

**కేడర్‌కు భరోసా.. భవిష్యత్ కార్యాచరణ**

దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ టీడీపీకి ఉందని, పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని చంద్రబాబు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం లాంటిదని, ఇక్కడ శిక్షణ పొందిన వారే అన్నిచోట్లా రాణిస్తున్నారని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశామని, "మై హెల్త్ యాప్" ద్వారా వారి ఆరోగ్య బాధ్యతను కూడా పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

**స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి..**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏ ఎన్నికైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, నేతలు ఇగోలకు పోకుండా మిత్రపక్షాలతో సమన్వయంతో ముందుకు సాగాలని హితవు పలికారు. "ఆరోగ్యకర, సంపన్న, సంతోష ఏపీ" (హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ) నిర్మాణమే తమ లక్ష్యమని, మహానాడు సాక్షిగా తెలుగు జాతి కోసం పునరంకితం అవుదామని పిలుపు నిచ్చారు. 2024 ఎన్నికల విజయాన్ని మళ్లీ పునరావృతం చేసేలా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.













# రిసర్వే పనులు వేగవంతం



- నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలనే లక్ష్యం
- పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ సజావుగా కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియ
- యర్రావారిపాలెం మండల సర్వేయర్ శ్రీనివాసులు

**యర్రావారిపాలెం, మే 27, ఆంధ్రనాడు:** యర్రావారిపాలెం మండలంలో రీసర్వే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని మండల సర్వేయర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం ప్రధాన లక్ష్యంగా అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా, సాంకేతిక ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ సర్వేను ఖచ్చితత్వంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూమి హక్కుల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజల సమక్షంలోనే సర్వే ప్రక్రియ రీసర్వేను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని శ్రీనివాసులు వెల్లడించారు. రైతులు, భూ యజమానులు ప్రత్యక్షంగా పాల్గొనేలా అవకాశం కల్పిస్తూ, వారి అభిప్రాయాలు, అనుమానాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భూ హద్దులు, రికార్డులలో ఉన్న భేదాలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిచేస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలనే సంకల్పం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్ణీత సమయానికి రీసర్వేను పూర్తిచేసి అర్హులైన రైతులకు పాసుపుస్తకాలు అందజేయడానికి అన్ని స్థాయిల్లో వేగంగా చర్యలు కొనసాగుతున్నాయని మండల సర్వేయర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## అంగరంగ వైభవంగా యర్రావారిపాలెంలో తొలిరోజు మహానాడు కార్యక్రమం



**యర్రావారిపాలెం, మే 27, ఆంధ్రనాడు:** యర్రావారిపాల్యం మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన మహానాడుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ హాజరయ్యారు. మండలంలోని ఒక క్లస్టర్లలో నిర్వహించిన మహానాడుకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులను పేరుపేరునా ఆప్యాయంగా పులివర్తి వినీల్ పలకరించారు.ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి.. కీర్తిశేషులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని పులివర్తి వినీల్ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే మహానాడు భారీ స్థాయిలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తుంది..... ఈ సంవత్సరం హైబ్రీడ్ పద్ధతిలో క్లస్టర్ల వారిగా మహానాడు నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు,వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపునిచ్చారు అని పులివర్తి వినీల్ తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గశీలో తెలుగుదేశం పార్టీ గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మహానాడు ను వర్చువల్ విధానంలో కార్యకర్తలు నాయకుల మధ్య కూర్చుని అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ఇతర నాయకులు ఇచ్చిన సందేశాలను విన్నారు.మహానాడులో చేసిన తీర్మానాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే తనయుడు పులివర్తి వినీల్ తెలిపారు ఈ మహానాడు కార్యక్రమానికి మండలంలో ఉన్న టిడిపి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాలొగొన్నారు.

## వైభవంగా బాట గంగమ్మ జాతర



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 27 :** మండలంలోని బసవరాజుకండ్రిగలో శ్రీ బాట గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారి శిరస్సు గ్రామంలోని కాటమరాజు స్వామి ఆలయం వద్ద మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమై బాణా సంచా వేడుకలు, డప్పు వాయిద్యాలు, చెక్కభజనలు, తమిళనాడు నయాండీ నృత్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించి బుధవారం వేకువజామున ఆలయంలో ప్రతి ష్ఠించారు. అనంతరం మహిళలు అమ్మవారికి పిండి దీవెనలను సమర్పించి గ్రామం లోని అన్ని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నా రు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గురువారం ఉదయం అమ్మవారి జలది మహోత్సవంతో గంగ జాతర వేడుకలు పూర్తికానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా గంగమ్మ జాతరలో అలంకరించిన విద్యుత్ దీపాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## జనగణనలో ప్రజలు బాగస్వాములు కావాలి

**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 27 :** మండలం ప్రజలందరూ జనగణనలో బాగస్వాములు కావాలని తహసీల్దార్ రామ్మూర్తి అన్నారు. జనగణన 2026 ప్రక్రియలోని మొదటి దశ అనగా గృహ గణన మే 1 వ తేదీ నుండి మొదలు కాబడి ఈనెల 30వ తేదీన పూర్తికానుందన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ జనగణనలో భాగస్వాములు కావలెని, ఇంకనూ ఏ ఇంటి నైనను జనగణన హౌస్ లిస్టింగ్ చేయకుండా ఉంటే లేక మీ ఇంటిని ఎన్యూమరేటర్ సంప్రదించకుండా ఉంటే లేక జనగణనలో నమోదు కాకుండా ఉంటే పెద్దపంజాణి మండల తహశీల్దార్ వారి నెంబరు 9491077075 లేక మండల అభివృద్ధి అధికారి నెంబరు 9491071388 ను సంప్రదించాలని, జనగణన హౌస్ లిస్టింగ్ కార్యక్రమం లో అందరూ భాగస్వాములు కావాలి అని కోరారు.

## యర్రావారిపాలెం మండల వ్యవసాయశాఖ అధికారిగా సుబ్రహ్మణ్యం



**యర్రావారిపాలెం, మే 27, ఆంధ్రనాడు:** యర్రావారిపాలెం మండల వ్యవసాయశాఖ అధికారిగా సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతం లో ఇక్కడ పనిచేస్తున్న అధికారి మరణించడం తో అప్పటి నుంచి ఖాళీగా ఉన్న వ్యవసాయశాఖ అధికారి స్థానం లో రైల్వే కోడూరు డివిజన్ పెనగలూరు వ్యవసాయశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం బదిలీ పై వచ్చి బుధవారం బాధ్యత లు చేపట్టారు. మండలంలో ప్రభుత్వం అందించే రాయతీలు, పథకాలు ప్రజలకు చేర్చడం లో అలసత్వం లేకుండా అందిస్తామని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

## మాజీ సీఎం జగన్ ను కలిసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



**కార్వేటి నగరం – ఆంధ్రనాడు, మే 27 :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీ నియోజకవర్గ ఇన్చార్జి కృపా లక్ష్మీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గ ఇన్చార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఎంపీలతో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అరాచకలను త్వరలో నియోజకవర్గస్థాయిలో నిరసన ర్యాలీలతో కార్యక్రమాలు చేపట్టాలని నాయకులకు సూచించారు.

# మనమంతా కార్యకర్తలమే... నాయకులం కాదు

- అనుపల్లెలో పరిశ్రమ ఏర్పాటు చేయిస్తా యువతకు ఉపాధి కల్పిస్తా
- ఎమ్మెల్యే నాని ప్రకటన



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 27:** తెలుగు దేశం పార్టీ కుటుంబం లాంటిదని,ఇందులో మనమంతా కార్యకర్తలమే గాని, నాయకులం కాదని యంయల్ఏ పులివర్తి నాని అన్నారు. రామచంద్రాపురం మండలంలోని మిట్టూరులో వున్న కమ్యూనిటీ హాల్ నందు మహానాడు 2026 వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మహానాడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, డప్పులు వాయిస్తూ, బాణా సంచాలు పేలుస్తూ ఘనస్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా విజయానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఎలాంటి కష్టాన్ని రానివ్వనని,అన్ని వేళలలో అండగా ఉండి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. తెలుగు దేశం పార్టీలో కార్యకర్తలే విజయ రథ సారథులని పేర్కొన్నారు.కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొంతమంది కుట్ర రాజకీయాలు చేస్తున్నారని,వారి ఉచ్చులో పడకుండా మన కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుక, మట్టిని యజమానులు, కాంట్రాక్టర్లు తరలించుకుంటున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా మట్టి, ఇసుక మాఫియా చేయలేదన్నారు.ఇసుక మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు బ్లూ మీడియా తప్పుడు కథనాలను వండి వార్చుతున్నదని, దానిని ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రతి సోమవారం నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు.ఎవ్వరూ నిరుత్సాహ పడకండని, అందరికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలందరినీ కంటికి రెప్పలాగా కాపాడుకుంటానన్నారు. స్థానికంగా కొంత మంది స్వలాభం కోసం మన విషయాలను ఎదుటి పక్షంకి చేరవేస్తూ వుండటం మంచిది కాదన్నారు. పార్టీలో వున్న మనందరం ఒక కుటుంబ సభ్యులం అన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలి అన్నారు. ప్రజల కోసం ఎన్ని అవమానాలు పడటానికైనా తాను సిద్దమేనన్నారు.చిన్నచిన్న విషయాలను సర్దుకుని పోవాలని తెలిపారు. స్థానిక నాయకులు కార్యకర్తలకు ఏదైన సమస్య వస్తే వెళ్ళి ఓదార్చాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, సింగల్ విండో చైర్మన్ చేకూరు జనార్దన్ చౌదరి, మాజీ ఎంపీపీ టి కేశవుల నాయుడు,ఎమ్ ఎస్ ఎం ఈ డైరెక్టర్ చిన్నబాబు, టిడిపి మాజీ అధ్యక్షులు ఆరి లీలా మోహన్ నాయుడు,కోరా హరి ప్రసాద్, కే నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి ముచ్చేలి ఢిల్లీ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు కొట్టే ధనంజయ రెడ్డి,మండల తెలుగు యువత అధ్యక్షుడు చేకూరు వెంకట ప్రసాద్,నీలకంఠ చౌదరి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు పసుపులేటి విజయ్ కుమార్ దద్దాల రదీష్,కొట్టే ముద్దు కృష్ణా రెడ్డి,సురేష్ నాయుడు,కృష్ణారెడ్డి, జవాది ప్రకాష్,కానాల ప్రసాద్,గిరిధర్ రెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, మాధవయ్య,పంతల వెంకటేష్ నాయుడు,మహేష్ నాయుడు,లెక్కల సురేంద్ర, సి రవికుమార్, త్యాగరాజులు, బాదూరు లతా సుబ్రమణ్యం రెడ్డి, గుణసుందరి, సుగుణ, నాయకులు కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# అనుపల్లెలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు

- యువతకు ఉపాధి కల్పిస్తామని భరోసా: పులివర్తి నాని



**రామచంద్రాపురం – ఆంధ్ర నాడు మే 27 :** చంద్రగిరి నియోజకవర్గంలోని, రామచంద్రాపురం మండలం, అనుపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా భారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతికి సమీపంలో భూముల రేట్లు అమాంతంగా వుండటంతో పరిశ్రమలు నెలకొల్పడానికి వీలు కానందున అనుపల్లి రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూములను పరిశ్రమల స్థాపనకు సుమారు 300 ఎకరాలను రెవెన్యూ అధికారులు గుర్తించారని, అందులో మొదటగా 125 ఎకరాలలో భారీ పరిశ్రమలు నెలకొల్పడానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అంగీకరించారని తెలిపారు. త్వరలో కంపె నీలకు భూములను అప్పగించి పరిశ్రమల స్థాపనను వేగ వంతం చేస్తామని యంయల్ఏ నాని చెప్పారు. యువ తకు అన్ని విధాల ఉపాధి కల్పించడానికి వడివడిగా అడు గులు వేస్తున్నామన్నారు. రెండేళ్లలో ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నానని వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 60 శాతం పైగా నెరవేర్చామని, మిగిలిన హామీలను కూడా నెరవేరుస్తానని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రధాన కర్తవ్యమన్నారు. ఇందుకోసం ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ మంత్రి లోకేష్ లతోపాటు, పలువురు అధికారుల సహాయ సహకారాలు తీసుకుంటున్నామన్నారు. ఐక్యతరాగంతో రానున్న స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ చిన్న, లెక్కల సురేంద్ర నాయుడు,ముని రామిరెడ్డి, చౌదరి, భక్త వత్సలం నాయుడు, చంద్రబాబు, లెక్కల చిట్టిబాబు నాయుడు, పులి వెంకటరెడ్డి, బ్రాహ్మణపల్లి మురళీకృష్ణ రెడ్డి, బాదూరు కోటీశ్వరరెడ్డి, ఆళ్లమడుగు కృష్ణారెడ్డి, సోమశేఖర్, జగదీష్ చౌదరి, ఆకా దేవరాజులు, గుర్రం దేవరా జు రెడ్డి, ప్రకాష్ యాదవ్, కానాల ప్రసాద్ రెడ్డి, గుణ సుందరి, లెక్కల మహేష్ నాయుడు, ధనంజయలు, బాదూరు శేఖర్, తగీరు మధు, బాలకృష్ణ, గజ్జల మహేష్, యారం జోహార్ రాయల్, నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి : తిరుపతి ఆర్డీవో రామ్మోహన్



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 27:** తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని తిరుపతి రెవెన్యూ డివిజన్ ఆఫీసర్,చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి రామ్మోహన్ అన్నారు. రామచంద్రాపురం మండలంలోని సి రామాపురం గ్రామంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలోని బి ఎల్ వో లు 2022 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసి ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన,నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ ఐ ఆర్–2026)నిర్వహణలో చంద్రగిరి నియోజకవర్గం వెనుకబడి ఉన్నదని బూత్ లెవెల్ ఆఫీసర్లు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కుటుంబంలో నివాసంలో ఉన్న ఓటర్లును, నివాసంలో లేని ఓటర్లును గుర్తించాలన్నారు. 2002 ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారిలో ప్రస్తుతం ఎంత మందికి ఓటు ఉంది, ఎంతమందికి ఓటు లేదు అనే విషయాన్ని సర్వే చేసి ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. మృతి చెందిన వారి ఓటర్ల జాబితా,నివాసం వేరే ప్రాంతాలకు మారిపోయిన వారి పేర్లను తొలగించి ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. 2002లో ఓటు ఉండి ప్రస్తుతం తమ ఓటు ఎక్కడ ఉందో తెలియని వారి వివరాలు కూడా సేకరించాలని సిబ్బందికి చెప్పారు. 18 సంవత్సరాల వయసు నిండిన కొత్తవారికి ఓటు హక్కు కల్పించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తాశీల్దార్ మధుసూదన్ రావు, డిప్యూటీ తాశీల్దార్ ఎం అన్వర్ భాష, వీఆర్వోలు శ్రీనివాసులు, ప్రదీప్ నాయుడు, వంశీకృష్ణ, బిఎల్వోలు పాల్గొన్నారు.

## రేణిగుంటలో టిడిపి మినీ మహానాడు



**రేణిగుంట, ఆంధ్రనాడు, మే 27:** రేణిగుంట మండలంలో బుధవారం తెలుగుదేశం పార్టీ 2026 మినీ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మినీ మహానాడులో భాగంగా మండల పరిధిలోని మూడు క్లస్టర్ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్చువల్ వేడుకల్లో మన నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నాను. కార్యక్రమానికి ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాము. అనంతరం సభా ప్రాంగణంలో కేడర్‌తో కలిసి మహానాడు లైవ్ స్క్రీనింగ్‌ను వీక్షించాము. మన అధినేత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశక ప్రసంగం మా అందరిలోనూ సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. మహానాడు థీమ్ స్త్రీ శక్తి' కావడం, అలాగే యువనేత నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న మొదటి మహానాడు ఇదే కావడంతో నియోజకవర్గ కేడర్ అంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. మండల పరిధిలోని క్లస్టర్ ఇన్చార్జిలు పుష్ప నాదం , సుబ్రహ్మణ్యం రెడ్డి , బుజ్జి నాయుడు పార్టీ నాయకులు మునస్వామి నాయుడు ,మహబూబ్బాషా, విద్యాసాగర్, నవాబ్, సుబ్రహ్మణ్యం,కొరియర్ రవి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో పండుగలా మహానాడు..

**-అన్ని గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన తెలుగు తమ్ముళ్లు**



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 27:** టీడీపీ వర్చువల్ గా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని తంబళ్లపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పండుగలా నిర్వహించారు. తంబళ్లపల్లి మండల కేంద్రంలోని రెండు కళ్యాణ మండపాల్లో సిల్వర్ స్క్రీన్ లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలోని ఎన్టీఆర్ ఘాట్‌లో తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళిగా మౌనం పాటించారు. వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్న వేదిక వరకూ ర్యాలీగా వెళ్లారు. అందరూ ఉత్సాహంగా మహానాడు కార్యక్రమాన్ని వెండి తెరపై ఆసక్తిగా తిలకించారు. వేదికల వద్ద నాయకులు, కార్యకర్తలకు భోజనం, ఏర్పాట్లను క్లస్టర్ ఇంచార్జిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, సిద్దమ్మ, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షులు తులసీధర్ నాయుడు, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు దేరంగుల చంద్ర, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, టీడీపీ మండల బీసీ నాయకులు పురుషోత్తం, వీరాంజనేయులు,మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు,గుండ్లపల్లి యూనిట్ ఇంచార్జి కాలా నారాయణ, తెలుగు యువత నాయకులు సుగవాసి శివకుమార్, మధు నాయుడు, నరసింహులు, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర, మాజీ సర్పంచి ఉత్తం రెడ్డి, మాజీ వార్డు సభ్యులు జగదీష్, మండల వికలాంగ అధ్యక్షులు రామాంజులు, మాజీ గ్రామాధ్యక్షుడు బోయపల్లె శివ, అన్ని గ్రామాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, బేరి శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, సిద్ధారెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, బాలాజీ, రెడ్డెప్ప, శివకృష్ణ, మదన, శ్రీనివాసులు, ఐసుల కిట్ట, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## మహానాడుతో మార్మోగిన కేవీబీ పురం.. ఉప్పొంగిన తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం..



**కేవీబీ పురం – ఆంధ్రనాడు, మే 27:** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు కార్యక్రమం కేవీబీ పురం మండల కేంద్రంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మండలంలోని 39 గ్రామపంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున హాజరై పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇంధన పొదుపు లక్ష్యంగా వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించడం అభినందనీయమన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు పార్టీ కార్యకర్తలు ఒకే వేదికపై పాల్గొనేలా ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సూచనలు అందించారని తెలిపారు.పార్టీ స్థాపన నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. మహానాడు కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు, జిల్లా రైతు అధ్యక్షుడు కనపర్తి గోపీనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి దొరబాబు నాయుడు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు లక్ష్మీపతి రాజు, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి,మండల యూత్ అధ్యక్షుడు వాసు నాయుడు, ఐ టి డి ఉపాధ్యక్షులు అఖిల్, కరపారెడ్డి బాలు, మునికృష్ణ, మస్తాన్, హరికృష్ణ, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడులపై పెరుగుతున్న నమ్మకం..

**- విలువలతో కూడిన విద్యకు చిరునామా ప్రభుత్వ బడులు**
**- మండల విద్యాశాఖ అధికారి రవికుమార్**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 27:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, విలువలతో కూడిన బోధనపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతోందని మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. కేవీబీ పురం మండలంలోని ఎస్ఎల్‌పురం, వేములపూడి గ్రామాల్లో బుధవారం విద్యార్థుల నమోదు పెంపుదలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి రవికుమార్, కేవీబీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానం, సిలబస్‌లో తీసుకొస్తున్న మార్పులు, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, ఇటీవల సాధించిన విద్యా ఫలితాలను వివరించారు. విద్యతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించే విధంగా బోధన జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు తగిన విధంగా తీర్చిదిద్దే చర్యలు తీసుకుంటున్నామని, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమం ప్రభావంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కేవీబీపురం ఉన్నత పాఠశాల, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, వసుంధర, గాయత్రి, రజిత, అనిత, ప్రకాష్, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్యకొండలో మైనింగ్ చేపట్టవద్దు

**- మైనింగ్, అటవీ శాఖ అధికారులను అడ్డుకున్న స్థానికులు**
**- వాహనాలను అడ్డగించి రోడ్డుపై ధర్నా**
**- మైనింగ్ ప్రక్రియ ఆపకుంటే ప్రాణ త్యాగాలకైనా సిద్ధం**



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 27:** భక్తులు కోరిన కోర్కెలు తీరిస్తూ రెండో దక్షిణ కైలాసంగా పేరొందిన తంబళ్లపల్లికి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సాదు కొండ, ఇనుము కొండ, మల్లయ్యకొండ సముదాయాల్లో మైనింగ్ చేపట్టకూడదని తంబళ్లపల్లి ప్రజలు ఆందోళన చేపట్టారు. బుధవారం సాదుకొండ, ఇనుము కొండల్లో సర్వే చేయడానికి మైనింగ్ అధికారులు మేనేజరు సత్యనారాయణ, సర్వేయర్ మాదవి లత బృందంతో పాటు అటవీ శాఖ బీఓలు మోహన్ రెడ్డి, రాజారెడ్డిలు తంబళ్లపల్లికి వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు, భక్తులు వందలాదిగా తరలి వచ్చి సాదు కొండకు ప్రవేశ మార్గంలో వున్న బోయపల్లెలో మైనింగ్ అధికారులను అడ్డుకున్నారు. ఎంతో మహిమ గల సాదు, మల్లయ్యకొండను మైనింగ్ పేరుతో ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మైనింగ్ సర్వే కోసం ఎందుకు వచ్చారంటూ చుట్టుముట్టి ప్రశ్నించారు. సర్వే కోసం అడవిలోకి పంపించేది లేదని అధికారులపైకి తిరగబడ్డారు. మైనింగ్ చేపట్టవద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పల్లెలో ర్యాలీ చేశారు. దీంతో మైనింగ్ శాఖ అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. మల్లయ్యకొండలో మైనింగ్ సర్వేకి అధికారులు వచ్చారన్న విషయం తంబళ్లపల్లి పట్టణంలో దావానంలా వ్యాపించింది. దీంతో సిద్దారెడ్డిగారిపల్లె మూడు రోడ్ల కూడలిలో స్థానిక ప్రజలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున గుమిగూడి మైనింగ్ అధికారుల వాహనాలను మరొమారు అడ్డుకున్నారు. రోడ్డుపై సుమారు గంట పాటు బైటాయించి ధర్నా చేసారు. మైనింగ్ ప్రక్రియ ఇంతటితో ఆపేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెద్దమండ్యం రోడ్డులో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్థంభించింది. సాదు మల్లయ్య కొండల చుట్టు సుమారు 300పైగా గ్రామాలు ఉన్నాయని దాదాపు అందరూ వ్యవసాయమే జీవనదారంగా బతుకుతున్నామన్నారు. ఎంతో మహిమ గల గొప్ప ప్రాసస్త్యం వున్న మల్లయ్యకొండలో మైనింగ్ చేపడితే భక్తుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతామన్నారు. ఇంతటి?తజో మైనింగ్ ప్రక్రియ ఆపకుంటే పోరాటాలు ఉదృతం చేస్తామని, ప్రాణ త్యాగాలకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇక్కడి పరిణామాలను ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్తామని మైనింగ్ అధికారులు చెప్పడంతో ప్రజలు శాంతించి ధర్నా విరమించారు. అనంతరం మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

## చంద్రగిరిలో అట్టహాసంగా మహానాడు

**- పండుగను మైమరిపించిన మహానాడు సంకల్పం**



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 27:** నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి పట్టణంలో 44 వ మహానాడును తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు అట్టహాసంగా బుధవారం ప్రారంభించుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుతో వృధా ఖర్చుల నివారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో మహానాడును తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్. ప్రారంభించటంతో అన్ని మండలాలలో క్లస్టర్ల వారీగా మహానాడు నిర్వహించుకున్నారు. పండుగను మైమరిపించే విధంగా నిర్వహించిన మహానాడుకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పులివర్తి నాని పేరుపేరున ఆప్యాయంగా పలకరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ 2026 మహానాడు హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపునిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో చేపట్టిన మహానాడును వర్చువల్ విధానంలో అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, ఇతర నాయకుల ప్రసంగాలను, తీర్మాణాలను డిజిటల్ డిస్ప్లే పై తిలకించారు. అనంతరం యంయల్ఏ నాని మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గశీలో తెలుగు దేశం పార్టీ గెలవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపుతున్నమన్నారు. చంద్రగిరి నియోజకవర్గం తరుపున మూడు ప్రతిపాదనలు పంపుతున్నామని నానీ చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలచపించటం, ఇళ్లు లేని నిరుపేదలకు ఎన్టీఆర్ గృహకల్ప కింద ఇళ్లు నిర్మాణం, వైసీపీ ప్రభుత్వ హయాంలో కూలిన బ్రిడ్జిల పునర్నిర్మాణం చేపట్టడం వంటి ప్రతిపాదనలుపంపుతున్నట్లు ప్రకటించారు. మండలం లోని క్లస్టర్ల వారిగా మహానాడులో చేసిన తీర్మానాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శివకోటి రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు గౌస్ బాషా, సరిత, రమణమూర్తి, హేమంబరధర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు ఎజిపల్లి బాల, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు అత్తూరు తులసీశ్వర్ రెడ్డి,సురేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, సక్కూరు ధనంజయ రెడ్డి, రాజులం గారి వినోద్, ప్రవీణ్ కుమార్, ఆదూరి నాగరాజు నాయుడు, గ్యాస్ నాగరాజు, సునీల్ కుమార్, వడ్లమూడి హరి నాయుడు, సతీష్, బెల్లంకొండ రమేష్ రాయల్, భగాత మణి యాదవ్, గోపి, విసిరిపాటి శంకర్, బాలసుబ్రమణ్యం, రాము, మంగాపురం భాస్కర్, ప్రభాకర్, మండి రావు, కొత్తపల్లి సునీత, నాయుడమ్మ, భూదేవి, పెద్ద ఎత్తున కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## రూ.5 కోట్లతో రూయా రూపురేఖలు మార్పు

**- ఆధునిక వైద్య సేవలు.. అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్**
**- పరికరాలు, మౌలిక వసతుల విస్తరణకు ఆమోదం**
**- రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యుత్తమ ప్రజాభిప్రాయం సాధించే లక్ష్యంతో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర రామ్ నారాయన్ రుయా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి సంబంధించిన సుమారు రూ.5 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది. ఈ మేరకు ఆసుపత్రి అభివృద్ధి మండలి వెంకటేశ్వర మెడికల్ కాలేజ్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధ్యక్షతన, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆసుపత్రి పనితీరు, మౌలిక వసతుల బలోపేతం, రోగులకు మెరుగైన వైద్య సేవల అందుబాటు అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., రాయలసీమలో ప్రతిష్టాత్మక వైద్య కేంద్రంగా ఉన్న రూయా ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, రోగులకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. సమావేశంలో ఆమోదం పొందిన ప్రధాన పనుల్లో క్యాజువాలిటీ, ఐసీయూ, రిస్యూ, ఏసీ వార్డులలో ఎలక్ట్రికల్, ఎయిర్ కండీషనింగ్ వ్యవస్థల మరమ్మత్తులు, ఆధునిక అనస్థీషియా వర్క్‌స్టేషన్ కొనుగోలు, లేజర్ సర్జరీ పరికరాల ఏర్పాటు, డయాగ్నోస్టిక్ ల్యాబ్ ఆధునీకరణ, రేడియాలజీ విభాగానికి అవసరమైన పరికరాల సమకూర్చడం వంటి అంశాలు పై చర్చించారు. అలాగే పీడియాట్రిక్ విభాగం అమినిటీ బ్లాక్ మరమ్మత్తులు, వివిధ వార్డులకు ఎయిర్ కండీషనర్ల ఏర్పాటు, కొత్త టిబి ఉ సిడి బ్లాక్‌లో సెంట్రల్ ఏసీ వ్యవస్థ, వెంటిలేటర్లు, మల్టీ ఛానల్ మానిటర్ల ఏర్పాటు వంటి ప్రతిపాదనలకు కూడా ఆ మోదం లభించిందని తెలి పారు. రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 50 సీసీటీవీ కెమెరాల ఏర్పా టు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపిడి బ్లాక్ ఏర్పాటు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సహా అవసరమైన సిబ్బంది నియామకాలకు కూడా సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇ చ్చింది. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, సీసీ రో డ్ల నిర్మాణం, పార్కింగ్ ప్రాంతంలో మరుగుదొడ్ల ఏర్పా టు, పాత భవనాల తొలగింపు, లిఫ్ట్ ఏర్పాటు వంటి మౌ లిక వసతుల అభివృద్ధి పనులకు కూడా ఆమోదం లభిం చింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ., ప్రభు త్వ సర్వేల్లో రూయా ఆసుపత్రి అగ్రస్థానంలో నిలిచేలా వై ద్యులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## భద్రతే మొదటి ప్రాధాన్యం

**- రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు**
**- జూన్ నాటికి బ్లాక్ స్పాట్ పనులు పూర్తి.. గంజాయి టెస్టింగ్ కిట్ల వినియోగం**
**- రాత్రి భద్రత కోసం రేడియం స్టికర్లు, సేఫ్టీ కిట్లు పంపిణీ**
**- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**
**- రోడ్డు భద్రతకు పోలీస్ శాఖ కఠిన చర్యలు**
**- నిబంధనలు పాటించకపోతే సీజ్**
**- ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సంయుక్తంగా తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ రహదారి, పోలీస్ సిబ్బందికి రూ.15 లక్షల విలువైన రోడ్డు సేఫ్టీ కిట్లను జిల్లా ఎస్పీ తో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., రెవెన్యూ, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, నేషనల్ హైవేస్ శాఖల సమన్వయంతో రోడ్డు భద్రతపై నిరంతరంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన బస్సు యాత్ర ద్వారా ప్రమాదాలకు ఎక్కువగా గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలకు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం 43 బ్లాక్ స్పాట్లను గుర్తించగా, వాటిలో 20 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలినవి జూన్ నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జాతీయ రహదారులపై నిలిచిపోయిన వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రమాదాలకు గురైన వారికి తక్షణ వైద్య సహాయం అందించేందుకు అవసరమైన వాహనాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ, అతివేగ నిరోధానికి ప్రత్యేక వాహనాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు సేఫ్టీ కిట్లలో రిఫ్లెక్టివ్ జాకెట్లు, ట్రాఫిక్ కోన్స్, టార్చ్ లైట్లు వంటి పరికరాలు ఉన్నాయని, ఇవి రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు తగ్గించేందుకు రేడియం స్టికర్ల వినియోగాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా తిరుపతి జిల్లాలో 10 వేలకు పైగా గంజాయి ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనుమానితులకు మూత్ర పరీక్ష ద్వారా కేవలం 5 నిమిషాల్లో ఫలితాలు వచ్చే విధంగా ఈ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ., రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, బస్సు యాత్ర ద్వారా గుర్తించిన బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలు అమలు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఆగి ఉన్న వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రేడియం స్టికర్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, ఎస్ఈ ఆర్ అండ్ బి రాజానాయక్, డీఎస్పీలు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాగలాపురంలో మహానాడు కార్యక్రమం



నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26: నాగలాపురం బైపాస్ రోడ్డులోని ఓ ప్రయివేట్ కళ్యాణ మండపంలో బుధవారం తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండలాధ్యక్షుడు ఆధ్వర్యం వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే టీడీపీ లక్ష్యం. మహానాడు పార్టీకి మార్గదర్శక వేదికగా నిలుస్తూ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది" అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. పార్టీ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

## నేడు ప్రదోష పూజలు



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 26:** నాగ లాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా వెదజల్లుతున్న శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం 4:30 గంటల నుండి 6:00 గంటల వరకు శ్రీ నం దీశ్వర స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిం చబడును కావున ఈ ప్రదోష పూజలో పాల్గొ నే భక్తులు రు 500 లు నగుదులు చెల్లించి పూజలో పాల్గొనవలసిందిగా ఆలయ కార్యని ర్వాహని అధికారి పీ.లత పేర్కొన్నారు.

## ఇ-డిస్ట్రిక్ట్ పోస్టుల పరీక్షలకు అర్హుల జాబితా విడుదల

**- మే 29 నుంచి హాల్‌టికెట్ల పంపిణీ**

**- జూన్ 3న పరీక్షల నిర్వహణ**

**- ఫోటోలు, ఆధార్ జిరాక్స్ తప్పనిసరి**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27 :** ఇ–డిస్ట్రిక్ట్ మేనేజర్, తిరుపతి, ఇ–డివిజనల్ మేనేజర్, శ్రీకాళహస్తి పోస్టుల భర్తీకి వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హుల జాబితాను జిల్లా అధికారులు విడుదల చేశారు. ఇ–డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టుకు 663 దరఖాస్తులు రాగా 640 మందిని, ఇ–డివిజనల్ మేనేజర్ పోస్టుకు 356 దరఖాస్తుల్లో 341 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తిరుపతి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఙతిరుపతి జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://tirupati.ap.gov.in పరీక్షలు జూన్ 3న తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కాలేజీలో నిర్వహించనున్నారు. హాల్‌టికెట్లు మే 29, 30, జూన్ 1 తేదీల్లో కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ జిరాక్స్‌తో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

## ఓటర్ల జాబితా మ్యాపింగ్‌లో నిర్లక్ష్యానికి తావులేదు

**- రెండు వారాల్లో మ్యాపింగ్ పూర్తి చేయాలి**

**- నిర్లక్ష్యం, తప్పిదాలపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరిక**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా మ్యా పింగ్ ప్రక్రియను ప్రాధాన్యంగా తీసుకొని రెండు వారాల్లో పూర్తి చేయాలని జి ల్లా కలె క్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈఆర్‌వోలు, ఏఈ ఆర్‌వోలు, బీఎల్‌వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, 2002 ఓటర్ల జాబి తా వివరాలను ప్రస్తుత జాబితాతో సరిపోల్చే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయాలన్నారు. బీఎల్‌వోలు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తప్పులు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్ర ్రక్రియపై మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కూడా అధికారులకు సూ చించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్ఓ నరసిం హులు పాల్గొన్నారు.

## పిఎంఆర్బిపి దరఖాస్తులకు ఆహ్వానం

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పిఎంఆర్బిపి)–2027 కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు, నామినేషన్లు ప్రారంభమైనట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన బాలబాలికలను జాతీయ స్థాయిలో గుర్తించేందుకు ఈ పురస్కారం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత వంటి రంగాల్లో ప్రతిభ చూపిన 5 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు అర్హులని తెలిపారు. దరఖాస్తులు కేవలం అధికారిక వెబ్‌సైట్ https://awards.gov.in ద్వారా మాత్రమే సమర్పించవలసి ఉంటుందని, చివరి తేదీ మే 31గా నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా లేదా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ద్వారా నామినేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

## ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశం

**- మే 30న తిరుపతి ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్**

**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** తిరుపతి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ఈ నెల 30న మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.19,500 వేతనంతో పాటు భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు అవసరమైన ధ్రువపత్రాలు, ఫోటోలతో ప్రభుత్వ ఐటీఐలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారులు. గణేష్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, తిరుపతి వారిని లేక సి. సురేష్ కుమార్, పి.జనార్ధన్, ప్లేస్మెంటు ఆఫీసర్స్, సెల్ నెం. 8297006849, 9533717170 వారిని సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రొసీడింగ్స్ కోసం శెట్టిపల్లి భూ బాధితుల ఆందోళన

**- న్యాయం కోసం రోడ్డెక్కిన శెట్టిపల్లి బాధితులు**

**- కలెక్టరేట్ వద్ద ఆందోళన.. పరిష్కారం లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** శెట్టిపల్లి భూ బాధిత కుటుంబాలకు వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ శెట్టిపల్లి భూ బాధితుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద శెట్టిపల్లి గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు జి. చిన్నబాబు మాట్లాడుతూ., శెట్టిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 387, 388, 402, 403, 409, 410, 411, 425, 426, 475లకు చెందిన సుమారు 450 కుటుంబాలు 2008 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. అయితే ఇంతకాలం గడిచినా సంబంధిత అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేయకపోవడంతో కుటుంబాలు అనిశ్చిత పరిస్థితుల్లో జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సొంత ఇల్లు కోసం జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో స్థలాలు కొనుగోలు చేసిన పేద, మధ్యతరగతి కుటుంబాలు నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మానసిక వేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లలో ఏవైనా పొరపాట్లు లేదా డబుల్ రిజిస్ట్రేషన్లు ఉన్నట్లయితే వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కమిటీ తరపున డిమాండ్ చేశారు. ప్రతి అర్హత గల కుటుంబానికి వెంటనే ప్రొసీడింగ్స్ జారీ చేయాలని, జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకొని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. తక్షణ పరిష్కారం లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు శ్రావణ్, వేణు, మురగ, విజయ భాస్కర్, అమ్ములు, సుజాత, ప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- ఇంటింటి సర్వేలో తప్పులకు తావులేకుండా చర్యలు**

**- తిరుపతి కార్పొరేషన్, చంద్రగిరి ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన**

**- బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం**



తిరుపతి కలెక్టరేట్ – అంధ్రనాడు, మే 27: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–2026 (ఎస్ఐఆర్–2026) కార్యక్రమాన్ని పారదర్శకంగా, కచ్చితత్వంతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉపాధ్యాయ నగర్, చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం ప్రాంతాల్లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవితో కలిసి, కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం అమలును పరిశీలించారు. ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలిస్తూ నమోదు ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, సూపర్వైజర్లతో సమావేశమైన కలెక్టర్ అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చాలని, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు, డూప్లికేట్ నమోదులను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఫీల్డ్ స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి తహసీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సూపర్వైజర్లు, బిఎల్ఓలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త సైనికుల్లాగాపోరాడాలి... డాలర్స్ దివాకర్ రెడ్డి

**- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పని చేస్తుంది.**

**- మహానాడు ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహం**



**తిరుపతి, మే 27, (ఆంధ్రనాడు):** ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పోరాడాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం 4వ క్లస్టర్ ఇన్చార్జి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ప్రారంభం ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. విశ్వ విఖ్యాత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరంవర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు ,బలహీన వర్గాల పక్షాన ప్రతి కార్యకర్త పార్టీ కోసం సైనికుల్లాగాపనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలే మనకు ఊపిరి కావాలన్నారు. జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కార్యనిర్వాక అధ్యక్షుడు నారా లోకేష్ సారధ్యంలో పార్టీని మరింత బలో పేతం చేయడమే తమ లక్ష్యం మ న్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు పనపాక లక్ష్మి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యకర్తలను గౌరవించే సంస్కృతి తెలుగుదేశం పార్టీ ద న్నారు. 20 29 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% సీట్లు ఇవ్వడం జరుగుతుందని మహానాడులో చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టిన యువనేత నేతలోకేష్ అని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పని పనిచేస్తున్నదన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం గా నిర్వహిస్తున్న మహానాడు ఈ ఏడాది వర్చువల్ డిజిటల్ విధానంలో ఘనంగా నిర్వహించడం చాలా సంతోషదగ్గ విషయమ న్నారు.తదనంతరం 4 వ క్లస్టర్ ఇంచార్జి శ్రీధర్ వర్మ మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న రీతిలో టిడిపి పనిచేస్తున్నద న్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామన్నారు. పార్టీ బలోపేతానికి తన సాయి శక్తుల కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మేడికొండ శ్రీహరి నాయుడు,ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్, క్లస్టర్ ఇన్చార్జిలు నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# స్థానిక, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు శుభపరిణామం..

**- టిడిపి రాష్ట్ర మహిళా నేత పుష్పావతి యాదవ్**

**- 38,39,40,41 క్లస్టర్ల వర్చువల్ మహానాడు మొదటి రోజు విజయవంతం...**



**తిరుపతి, మే 27, (ఆంధ్రనాడు):** తెలుగుదేశం పార్టీ మొదటి నాడు మహానాడు సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మహిళలకు స్థానిక సంస్థలతో పాటు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పిస్తామని ప్రతిపాదన చేయడం శుభ పరిణామమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ మహిళా నేత వి పుష్పావతి యాదవ్ చెప్పారు. 11వ క్లస్టర్ ఇన్చార్జి అయిన పుష్పావతి యాదవ్ ఆధ్వర్యంలో రెండు రోజుల మహానాడు కార్యక్రమంలో భాగంగా బుధవారం చెన్నారెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాలులో 38, 39, 40, 41 క్లస్టర్లకు చెందిన టిడిపి వర్చువల్ మహానాడు కార్యక్రమం జరిగింది. మొదటగా టిడిపి జాతీయ జెండాను పుష్పావతి యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనభాక లక్ష్మీ, నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకులు పర్వీన్ తాజ్ చేతుల మీదుగా ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా కమ్యూనిటీ హాల్ లో జరుగుతున్న వర్చువల్ మహానాడు ను పరిశీలించి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావడంతో వారంతా పుష్పావతి యాదవ్ ను అభినందించారు. మొదటి రోజు మహానాడు వర్చువల్ సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొదటిరోజు సమావేశంలో పార్టీ సిద్ధాంతాలు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ బలోపేతం పై నాయకులు విస్తృతంగా ప్రసంగించారు. వర్చువల్ ప్రసారాల ద్వారా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ల ప్రసంగాలతో పాటు ముఖ్య నేతల సందేశాలను కమ్యూనిటీ హాల్ నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, పర్వీన్ తాజ్ లు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నేతృత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. చెన్నారెడ్డి కాలనీ కమ్యూనిటీ హాలులో నాలుగు కస్టర్లకు సంబంధించి వర్చువల్ టిడిపి మహానాడుకు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు అవడం పట్ల 11 వ క్లస్టర్ ఇంచార్జ్ పుష్పావతి యాదవ్ ను వారు ప్రత్యేకంగా అభినందించి అక్కడున్న వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు. మధ్యాహ్నం అక్కడికి వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలకు మంచి భోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పుష్పవతి యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు గతంలో స్వయంగా అక్కడికి వెళ్లి వీక్షించే వారన్నారు. కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ల ఆలోచనలతో ప్రతి నగరంలో పట్టణంలో నియోజకవర్గ కేంద్రాలలో పార్టీ నాయకులు కార్యకర్తలు వీక్షించేలా ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేయడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరికి పార్టీ జెండాను చూస్తే నమ్మకం భరోసా కలుగుతుందని చెప్పారు. రాజకీయాలలో మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఎప్పటికీ పేదల పక్షాన నిలబడే పార్టీ అని పుష్పావతి యాదవ్ గుర్తు చేశారు. 38 వ క్లస్టర్ ఇంచార్జ్ సంతోష్ కుమార్, యూనిట్ ఇంచార్జ్ సందీప్, కో యూనిట్ ఇంచార్జ్ విశ్వనాథ్, 39వ క్లస్టర్ ఇంచార్జ్ ధర్మారెడ్డి, యూనిట్ ఇన్చార్జి మురుగ, ప్రధాన కార్యదర్శి రాధిక, 40వ క్లస్టర్ ఇంచార్జ్ బాలాజీ, రాజకుమార్, నారాయణ 41వ క్లస్టర్ జయ ప్రకాష్ ప్రధాన కార్యదర్శి మురళి, యూనిట్ ఇన్చార్జి కెవి రమణ సూర్యకుమారి రాయల్, రేవతి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# యువతకు గుడ్ న్యూస్

**- తిరుపతిలో భారీ జాబ్ మేళా**

**- 17 కంపెనీలు.. 800 ఉద్యోగాలవకాశాలు**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29న తిరుపతిలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతిలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో జరుగనుంది. ఈ జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను బుధవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ సిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నై పరిసర ప్రాంతాలకు చెందిన 17 బహుళజాతి కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. మొత్తం 800కు పైగా ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని వెల్లడించారు. పదో తరగతి నుంచి పీజీ వరకు వివిధ అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జాబ్ మేళా ద్వారా పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## బంగారు తిరుచ్చిపై సూర్యనారాయణడి అభయం



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 27:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ సూర్యనారాయణ స్వామి బుధవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి జన్మ నక్షత్రం అయిన హస్త నక్షత్రం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు రమేష్, సురేష్, ముని చంగల్రాయులు, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఘనంగా మహానాడు

**- నియోజకవర్గంలోని 10 క్లస్టర్లలో సాగిన కార్యక్రమం**

**- ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు**

**- ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు దాకా సాగిన కార్యక్రమాలు**



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 27:** పలమనేరు నియోజకవర్గంలో మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని 10 క్లస్టర్‌ల పరిధిలో వర్చువల్ విధానంలో సాగిన ఈ మహానాడు కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి అనితా దీప్తి హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలుగుజాతి ప్రగతి మరియు తెలుగు ప్రజల అభివృద్ధి కోసం ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి మహానాడు అనేది కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాకుండా పార్టీ బలం, త్యాగం, క్రమశిక్షణ, సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబమని ఆమె తెలిపారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా జరిగే మహానాడు పసుపు సైన్యానికి ఓ పండుగ అని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా మహానాడును కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పొదుపు పిలుపు మేరకు ఈసారి వర్చువల్ రూపంలో నిర్వహించాలని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారన్నారు. ఈసారి వినూత్నంగా మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ మహానాడు కార్యక్రమం కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే గొప్ప వేదిక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో క్లస్టర్ ఇంచార్జిలు సి.రామచంద్ర నాయుడు, బ్రహ్మయ్య, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రసాద్ నాయుడు, భాస్కర్ రెడ్డి, జీ.రామచంద్ర నాయుడు, మంజు నాథ్, పలని వేలు, నారాయణస్వామిలతో పాటు యూనిట్ ఇన్చార్జులు మరియు పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిషోర్ సుడిగాలి పర్యటన

**- మహానాడు వేళ 10 క్లస్టర్లలో వీక్షణ**



**పీలేరు - ఆంధ్రనాడు, మే 27:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి దివంగత శ్రీ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "మహానాడు" కార్యక్రమాన్ని ఈ ఏడాది వర్చువల్ లైవ్ ఈవెంట్ విధానంలో క్లస్టర్ వైజ్ ప్రదర్శింపబడింది. అందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేసి కార్యకర్తలతో కలిసి వీక్షించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి నియోజకవర్గ అబ్జర్వర్ మాసారపు సుబ్బయ్యతో కలిసి ఆరు మండలాల్లోని 10 క్లస్టర్లను ఎమ్మెల్యే కిషోర్ సందర్శించారు. ప్రతి క్లస్టర్‌లోనూ తెలుగుదేశం జెండాను ఆవిష్కరించి, దివంగత నేత శ్రీ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రసారమైన మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలు,7 నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "మధ్యప్రాచ్య యుద్ధ పరిస్థితుల కారణంగా దేశంలో ఇంధన వినియోగాన్ని క్రమబద్ధీకరించాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించారు. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు పార్టీ తీసుకున్న నిర్ణయాలు, భవిష్యత్తులో తీసుకోబోయే కార్యాచరణపై కార్యకర్తలను ఉద్దేశించి వివరించారు. మహానాడులో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ బలోపేతంపై చర్చించిన అంశాలను క్షుణ్ణంగా తిలకించి, ప్రతి కార్యకర్త వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పిలుపునిచ్చారు.

# కిషోరి బాలికల నెలసరి పరిశుభ్రత,పౌష్టికాహార లోపం

**- బాలికల ఆత్మవిశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం**

**- పోర్డ్ సంస్థ అధ్యక్షురాలు జల్లా లలితమ్మ**



మదనపల్లి – ఆంధ్రనాడు, మే 27: అన్నమయ్య జిల్లాలో పోర్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వే ఆధారంగా కిషోరీ బాలికల నెలసరి పరిశుభ్రత, పౌష్టికాహార లోపం, చదువులో తలెత్తుతున్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు ఆందోళనకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించబడిందని పోర్డ్ సంస్థ అధ్యక్షురాలు జల్లా లలితమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపం, పేదరికం, పరిశుభ్రమైనశానిటరీ ప్యాడ్ల అందుబాటు లేకపోవడం, టాయిలెట్ సౌకర్యాల కొరత కారణాలతో బాలికలు అనేక శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. నెలసరి సమయంలో సరైన పరిశుభ్రత పాటించకపోవడం వల్ల రక్తహీనత, ఇన్‌ఫెక్షన్లు, బలహీనత వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అదేవిధంగా పౌష్టికాహార లోపం కారణంగా బాలికల ఎదుగుదల, విద్య, ఆత్మవిశ్వాసంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ముఖ్యంగా పాఠశాలల్లో వాష్‌రూమ్ సౌకర్యాల లేమి, అపోహలు, సిగ్గు కారణంగా కొంతమంది బాలికలు పాఠశాలకు హాజరు కావడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, పాఠశాలలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఐసిడిఎస్, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, గ్రామస్థాయి సంస్థలతో కలిసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కిషోర బాలికలకు నెలసరి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హించడం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో శానిటరీ ప్యాడ్ల పంపిణీ, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పోషకాహార సరఫరా పెంపు పాఠశాలల్లో ప్రత్యేక టాయిలెట్, నీటి సౌకర్యాల ఏర్పాటు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నిర్ధారణ శిబిరాలు నిర్వహించడం బాలికల చదువుకు అంతరాయం కలుగకుండా పాఠశాల స్థాయిలో సహాయక వాతావరణం కల్పించడం కోసం, జిల్లా స్థాయిలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక, స్పష్టమైన విధి విధానాలు రూపొందించడం అత్యంత అవసరమన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు సమన్వయ కమిటీల ఏర్పాటు, నిరంతర పర్యవేక్షణ, డేటా సేకరణ, అవగాహన కార్యక్రమాల ద్వారా కిషోరీ బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాది వేయవచ్చునని, ఫోర్డ్ అధ్యక్షురాలు జల్లా లలితమ్మ ఆకాంక్షించారు.

# అంబరాన్నంటిన మహానాడు సంబరాలు

**- టిడిపి శ్రేణులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా**



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 27:** అన్నమయ్య జిల్లా, మదనపల్లి నియోజకవర్గంలో మహానాడు – 2026 సంబరాలు అంబరాన్నంటాయి.బుధవారం పట్టణంలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో 7 క్లస్టర్ ఇంచార్జ్ కదిరి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పార్టీని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు, ఇతర ప్రముఖుల ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించి భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం రెండో రోజు సైతం మహానాడులో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ నాదేళ్ల అరుణ్ తేజ, శ్రీరాములు, కొప్పల హరినాథ్, జాఫరన్నీషా, రవి నాయక్, నాగరాణి, మధుమిత, బోనాసి జాన్ బాబు, రామకృష్ణ, సీనియర్ తెలుగుదేశం నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం త్యాగమూర్తి రమాబాయి

**- త్యాగనిరతికి ప్రతిరూపం రమాబాయి**

**- కోట్లాది మంది బిడ్డల కోసం స్వంత బిడ్డలను త్యాగం చేసిన మహామాత**



**పీలేరు – ఆంధ్రనాడు, మే 27:** మాతా రమాబాయి త్యాగానికి ప్రతిరూపం, సామాజిక పోరాటంలో నిశ్శబ్ద భాగస్వామి భారత రాజ్యాంగ నిర్మాత, పీడీత జనోద్ధారకుడు "డాక్టర్" బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత ప్రయాణంలో, ఆయన ఆశయాల సాధనలో నిశ్శబ్దంగా, అచంచలంగా నిలిచిన మహాశక్తి రమాబాయి కేవలం ఒక గొప్ప నాయకుడి జీవిత భాగస్వామిగానే కాకుండా,తన స్వీయ త్యాగాలతో భారతదేశ చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని ఆమె సంపాదించుకున్నారు. నేడు రమాబాయి 91వ వర్ధంతి సందర్భంగా మాలమహానాడు మండల కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో ఆ త్యాగమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళలర్పించారు ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాట్లాడుతూ ఆమె బాల్యం ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందుల నడుమ గడిచింది. అయితే, బాల్యంలో ఎదుర్కొన్న ఆ కఠిన పరిస్థితులే ఆమెలో అపారమైన ధైర్యాన్ని, సహనాన్ని పెంపొందించాయి చిన్న వయస్సులోనే అంబేడ్కర్ తో రమాబాయి వివాహం జరిగింది అంబేడ్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లినప్పుడు, భారతదేశంలో కుటుంబ భారాన్ని రమాబాయి పూర్తిగా తన భుజాలపై వేసుకున్నారు తీవ్రమైన పేదరికం, కరవు పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఏనాడూ అధైర్యపడకుండా ఇల్లాలుగా తన బాధ్యతలను నిర్వర్తించారు. భర్త చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే సంకల్పంతో ఆకలిని, కష్టాలను నిశ్శబ్దంగా భరించారు బాబాసాహెబ్ అంబేడ్కర్ సాధించిన విజయాల వెనుక రమాబాయి త్యాగం వెలకట్టలేనిది సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం బాబా సాహెబ్ చేసిన సామాజిక ఉద్యమాలకు ఆమె నైతిక బలాన్ని అందించారు తన సొంత సుఖాలను, కోరికలను పక్కన పెట్టి, సమాజ శ్రేయస్సు కోసమే జీవించారు నిరంతర కష్టాలు, అనారోగ్య సమస్యల కారణంగా 27 మే 1935న రమాబాయి కన్నుమూశారు రమాబాయి జీవితం కేవలం ఒక వ్యక్తి కథ కాదు అది సహనం, అంకితభావం మరియు మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనం. నేటి సమాజంలో మహిళల సాధికారతకు, ఆత్మస్థైర్యానికి ఆమె జీవితం ఒక గొప్ప ప్రేరణ దేశం కోసం, సమాజ మార్పు కోసం ఆమె చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి ఈ దేశ అనగారిణ వర్గాల గుండెల్లో శాశ్వతంగా సజీవంగా ఉంటారని కొనియాడారు.కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక అన్నమయ్య జిల్లా కన్వీనర్ గుండ్లూరు ఇరగన్న, మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి తుమ్మల రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు

# క్రమశిక్షణ మార్గదర్శకత్వమే విజయానికి పునాది: జేడీ లక్ష్మీనారాయణ




**తిరుపతి, మే 27, ఆంధ్రనాడు:** విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది వేసుకోవాలని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని ఆయన పేర్కొన్నారు. ఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో దేశంలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు మంగళవారం తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డు, హోటల్ ఇష్టా వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించారు. జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ ఫౌండేషన్ కోర్సులను తీసుకొచ్చామని రెసోనెన్స్ నిర్వాహకులు తెలిపారు. వారానికి మూడు రోజులు తరగతులు జరుగుతాయని, ఆఫ్లైన్, ఆన్‌లైన్ రెండు విధానాల్లోనూ అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందిస్తామని రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా అన్నారు. ఈ కేంద్రం విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను నిపుణులు వివరించారు. 2001లో ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ కోటాలో రెసోనెన్స్‌ను స్థాపించా రు. గత రెండు దశాబ్దాల్లో 87 నగరాల్లోని 150కి పైగా కేంద్రాల ద్వారా 10 లక్షలకు పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల మందికి పైగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ మెడికల్ కాలేజీల్లో ప్రవేశం పొందినట్లు వెల్లడించారు. 2018లో హైదరా బాద్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్థానం మొదలు పెట్టిన రెసోనెన్స్, ఏడేళ్లలోనే 6,100 మందికి పైగా వి ద్యార్థులకు ఐఐటీలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్‌లలో సీట్లు సాధించి పెట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 50కి పైగా క్యాంపస్‌లతో విద్యా సేవలను అందిస్తోందని నిర్వాహకులు తెలియజేశారు.

# సన్‌రైజర్స్ కథ ముగిసింది..
# ఎలిమినేటర్‌లో రాజస్థాన్ ఘనవిజయం!

**- ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో 47 పరుగుల తేడాతో ఓడిన సన్‌రైజర్స్**
**- క్వాలిఫయర్-2కి చేరిన రాజస్థాన్ రాయల్స్**
**29 బంతుల్లో 97 పరుగులతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ**
**- భారీ లక్ష్య ఛేదనలో తడబడిన హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్**
**- టోర్నీ నుంచి నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రస్థానం ముగిసింది. బుధవారం చండీగఢ్‌లో జరిగిన కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 47 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్‌కు, ఆ తర్వాత రాజస్థాన్ బౌలర్ల క్రమశిక్షణతో కూడిన ప్రదర్శన తోడవడంతో సన్‌రైజర్స్ ఫైనల్ ఆశలు గల్లంతయ్యాయి.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆరంభం నుంచే హైదరాబాద్ బౌలర్లపై



విరుచుకుపడ్డాడు. కేవలం 29 బంతుల్లో 5 ఫోర్లు, 12 సిక్సర్లతో 97 పరుగులు చేసి పెను విధ్వంసం సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును తృటిలో చేజార్చుకున్నాడు. అతని దూకుడుతో రాజస్థాన్ 8 ఓవర్లకే 125 పరుగులు చేసింది. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (21 బంతుల్లో 50) కూడా మెరుపు అర్ధశతకంతో రాణించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు సాధించింది.

భారీ లక్ష్య ఛేదనకు దిగిన సన్‌రైజర్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలోనే తన పదును చూపించాడు. అభిషేక్ శర్మ (0), ట్రావిస్ హెడ్ (17), ఇషాన్ కిషన్ (33) వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపి హైదరాబాద్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. జట్టును ఆదుకుంటాడనుకున్న హెన్రిచ్ క్లాసెన్ (18) కూడా విఫలమయ్యాడు. నితీశ్ రెడ్డి (38), సలీల్ అరోరా (35) కాసేపు పోరాడినా ఫలితం లేకపోయింది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ 19.2 ఓవర్లలో 196 పరుగుల వద్ద ముగిసింది. దీంతో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం సాధించి క్వాలిఫయర్-2 మ్యాచ్ కు అర్హత సాధించింది. ఈ నెల 29న జరిగే క్వాలిఫయర్-2 పోరులో రాజస్థాన్... గుజరాత్ టైటాన్స్ తో తలపడనుంది.



## కాసేపు అదృశ్యమైన హార్దిక్ పాండ్యా ఇన్‌స్టా ఖాతా

ప్రొఫైల్ కోసం వెతికితే 'యూజర్ నాట్ ఫౌండ్' అనే సందేశం
'ఈ ప్రొఫైల్ ప్రైవేట్', 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్' అంటూ మెసేజ్
చర్చనీయాంశంగా మారిన పాండ్యా ఇన్‌స్టా ఖాతా అదృశ్యం

భారత ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఈరోజు కొద్దిసేపు అదృశ్యమై, కొన్ని గంటల తర్వాత తిరిగి ప్రత్యక్షమవడంతో అభిమానులు గందరగోళానికి గురయ్యారు. పాండ్యా ప్రొఫైల్ కోసం వెతికినప్పుడు మొదటగా 'యూజర్ నాట్ ఫౌండ్' అనే సందేశం కనిపించింది, అంతేకాకుండా ఆ ఖాతాలో పోస్టులు గానీ, ప్రొఫైల్ చిత్రం గానీ లేవు. మరికొంతమంది వినియోగదారులకు 'ఈ ప్రొఫైల్ ప్రైవేట్', 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్' వంటి మెసేజ్ కనిపించింది.

దీంతో, పాండ్యా తన ఖాతాను తొలగించాడా లేదా తాత్కాలికంగా ఆపివేశాడా అనే దానిపై సామాజిక మాధ్యమంలో చర్చ జరిగింది. చివరికి ఆ ఖాతా పునరుద్ధరించబడినప్పటికీ, ఈ ఆకస్మిక అదృశ్యంపై పాండ్యా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. పాండ్యా సోషల్ మీడియా ఖాతా చర్చనీయాంశం కావడం ఇదే మొదటిసారి కాదు. మే 11వ తేదీన అతడి సోషల్ మీడియా యాక్టివిటీ దుమారం రేపింది.

పాండ్యా ముంబై ఇండియన్స్‌కు సంబంధించిన కొన్ని పోస్టులను తొలగించాడని, జట్టును అన్-ఫాలో చేశాడని ప్రచారం జరిగింది. కానీ కాసేపటికి అంతా సద్దుమణిగింది. దీంతో అదంతా సోషల్ మీడియాలో ఎర్రర్ కారణంగా అలా జరిగిందని భావించారు. ఇప్పుడు మరోసారి అలాంటి పరిస్థితి ఎదురు కావడం గమనార్హం. ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో పాండ్యా నేతృత్వంలో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన చేసింది. కనీసం ప్లేఆఫ్స్‌కు కూడా చేరలేదు. పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచింది.

# ఏ ప్రాంతానికి వెళ్లినా స్థానిక భాషలో మాట్లాడటానికే ప్రయత్నిస్తా : శ్రీలీల

తాను ప్రతి భాషను గౌరవిస్తానన్న శ్రీలీల
ప్రస్తుతం నాలుగైదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నట్టు వెల్లడి
స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులతో బంధం పెరుగుతుందన్న శ్రీలీల



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే తన అద్భుతమైన డాన్స్, చలాకీతనంతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, ఈ అమ్మడికి టాలీవుడ్‌తో పాటు ఇతర పరిశ్రమల్లోనూ వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ 'ఐ-55' ప్రాజెక్ట్‌తో పాటు, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన 'ఆషికీ-3' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది.

భాషా భేదాలు లేకుండా ఇండియన్ సినిమాలో దూసుకుపోతున్న శ్రీలీల... తాజాగా భాష, సంస్కృతిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయడంపై ఆమె మాట్లాడుతూ.. "నేను ప్రతి భాషను ఎంతో గౌరవిస్తాను. ప్రస్తుతం నాలుగు, ఐదు భాషల్లో ప్రాజెక్టులు చేస్తున్నాను. నేను ఏ కొత్త ప్రాంతానికి వెళ్లినా, స్టేజ్ పైన ఉన్నంతసేపూ అక్కడి స్థానిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నిస్తాను. ఆ ప్రాంత ప్రజలకు, వారి సంస్కృతికి నేను ఇచ్చే కనీస గౌరవం అది" అని స్పష్టం చేసింది.

పబ్లిక్ ఈవెంట్స్‌లో స్థానిక భాషలో మాట్లాడటం వల్ల ప్రేక్షకులకు, సెలబ్రిటీలకు మధ్య ఉన్న దూరం తగ్గి, ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని శ్రీలీల అభిప్రాయపడింది. ఇది కేవలం సినిమా పబ్లిసిటీ కోసం చేసే పని కాదని, మనకు గుర్తింపునిచ్చిన ఆయా ప్రాంతాల ఐడెంటిటీని గౌరవించడమేనని తెలిపింది.



## డిప్యూటీ సిఎంతో నిర్మాతల భేటీ

తెలుగు సినీ నిర్మాతల మండలికి చెందిన ప్రముఖ నిర్మాతలు రవి శంకర్, సూర్యదేవర నాగవంశీ, సాహు గారపాటి, సతీష్ కుమార్ తదితరుల బృందం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను రాజమండ్రిలోని షెల్టాన్ హోటల్‌లో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భేటీ అనంతరం నిర్మాతలు మాట్లాడుతూ, "గత రెండు వారాలుగా సినిమా ఇండస్ట్రీలో నెలకొన్న పరిస్థితులపై పవన్ కళ్యాణ్‌తో చర్చించాము. ఆయన సమస్యలను సుదీర్ఘంగా విన్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పూర్తి పరిష్కారాలు వస్తాయని, నిర్మాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మల్టీప్లెక్స్ మోడల్ తరహాలో లాభాల్లో కొంత శాతం షేరింగ్ అమలు చేస్తే సింగిల్ స్క్రీన్ థియేటర్లు నిలబడతాయని వివరించాము. కేవలం 'పెద్ది' సినిమా గురించే కాకుండా, సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాము. నిర్మాతలు--ఎగ్జిబిటర్ల మధ్య ఉన్న వివాదాలు త్వరలోనే పరిష్కారమవుతాయని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ అంశాలపై దృష్టి సారించాలని ఆయన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు సూచించారు" అని తెలిపారు.

## సల్మాన్ ఖాన్ కు జోడీగా నయనతార



కథానాయిక నయనతార తాజాగా బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ సరసన ఓ భారీ ప్రాజెక్ట్‌లో నటించనుంది. టాలీవుడ్ స్టార్ దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా ఎంపికైంది. ఇప్పటికే షారుఖ్ ఖాన్ నటించిన సూపర్ హిట్ చిత్రం 'జవాన్' ద్వారా నయనతార హిందీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆమె చేసిన స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సల్మాన్ ఖాన్‌తో చేస్తున్న తాజా ప్రాజెక్ట్‌లో నయనతార పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. 'జవాన్' తరహాలోనే ఇందులో కూడా ఆమె యాక్షన్ ప్రధాన పాత్రలో కనిపించనుందని తెలుస్తోంది. ఈ సినిమా కోసం నయనతార డూప్ లేకుండా, ఫైట్ మాస్టర్ల పర్యవేక్షణలో స్వయంగా యాక్షన్ స్టంట్స్ చేస్తోందని సమాచారం.

ANDHRANADU
TELUGU DAILY

గురువారం
28.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# అమర హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ డే 2026 ఘనంగా నిర్వహణ

## - ప్రాణరక్షణ వైద్య సేవల పట్ల అమర హాస్పిటల్ ముందుంటాం:డా రమాదేవి గౌరినేని



**తిరుపతి–ఆంధ్రనాడు,మే 27:**
అమర హాస్పిటల్ లో ఎమర్జెన్సీ మెడిసిన్ డే 2026 ను ఘనంగా నిర్వహించారు. అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యత, ప్రాణరక్షణలో ముందుండే వైద్య సిబ్బంది అంకితభావం, సమాజానికి సమయానుకూల అత్యవసర సేవలు అందించేందుకు అవసరమైన సమిష్టి కృషిని గుర్తుచేసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించి ఘణంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా" రమాదేవి గౌరినేని,తిరుపతి సీనియర్ ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్రహ్మణ్యం, తిరుపతి డీఎస్పీ, షీ టీమ్ లీడ్ శ్రీలత; తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి, తిరుపతి టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్ విశిష్ట అతిథులుగా విచ్చేశారు. వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్‌తో పాటు ప్రజాసేవ,సామాజిక సంస్థల ప్రముఖులు పాల్గొని ఎమర్జెన్సీ, ట్రామా కేర్ సేవల ఆత్మను కొనియాడారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో క్లినికల్ ,నాన్–క్లినికల్ సిబ్బందితో కలిసి సిపిఆర్ చాలెంజ్ నిర్వహించారు. ప్రాణరక్షణ పునరుద్ధరణ నైపుణ్యాలు, అత్యవసర సిద్ధతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది. వివిధ విభాగాల ఉద్యోగులు చురుకుగా పాల్గొని, అత్యవసర పరిస్థితుల్లో ప్రతి క్షణం మరియు ప్రతి స్పందన ఎంతో ముఖ్యమని తెలియజేశారు.అలాగే ఎమర్జెన్సీ మెడిసిన్ డే క్విజ్ పోటీలు నిర్వహించగా, ఎమర్జెన్సీ కేర్, ట్రామా సిస్టమ్స్, డిజాస్టర్ రెస్పాన్స్, క్రిటికల్ కేర్, వైద్య అవగాహన అంశాలపై జ్ఞానపరమైన మరియు ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఎమర్జెన్సీ విభాగంలో సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ హౌస్‌కీపింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది, టెక్నీషియన్లు, అడ్మినిస్ట్రేటివ్, సపోర్ట్ స్టాఫ్‌లను ప్రత్యేకంగా సన్మానించారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా కరుణతో, సమర్థవంతంగా రోగులకు సేవలందిస్తున్న వారి సేవలను ప్రశంసించారు.

అమర హాస్పిటల్ ఎటిఈఎస్ అందిస్తున్న అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు, ట్రామా స్పందన వ్యవస్థలు, మానవతా కార్యక్రమాలను అభినందించారు. రోగి కేంద్రిత వైద్యం, ట్రామా మేనేజ్‌మెంట్, అత్యవసర సిద్ధత, సామాజిక భాగస్వామ్యం మరియు ప్రాంతంలో అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడంలో అమర హాస్పిటల్ చేస్తున్న కృషిని కొనియాడారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ గౌరినేని మాట్లాడుతూ...ఎమర్జెన్సీ మెడిసిన్ అనేది ఆరోగ్య సేవల అసలైన ఆత్మ. మనిషి జీవితం అత్యంత ప్రమాదంలో ఉన్న సమయంలో వెంటనే స్పందించడం అత్యవసర వైద్య సేవల ముఖ్య లక్ష్యం. అమర హాస్పిటల్‌లో వేగం, సాంకేతికత, జట్టు భావన, మానవత్వాన్ని సమన్వయం చేస్తూ అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలను అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాము" అని తెలిపారు.డాక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ ప్రతి విజయవంతమైన ఎమర్జెన్సీ స్పందన వెనుక అంకితభావంతో పనిచేసే గొప్ప బృందం ఉంటుంది. అత్యంత క్లిష్ట సమయాల్లో రోగులు వారి కుటుంబాలకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు,ఈయంటి లు, టెక్నీషియన్లు, హౌస్‌కీపింగ్, భద్రతా సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్ టీమ్‌లందరికీ ఈ సందర్భంగా మా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.డాక్టర్ తమోరీస్ కోలే మాట్లాడుతూ ఎమర్జెన్సీ మెడిసిన్ అనేది కేవలం ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితులకు చికిత్స అందించడం మాత్రమే కాదు; ట్రామా, విపత్తులు, మహమ్మారులు, ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సమర్థ ఆరోగ్య వ్యవస్థను నిర్మించడం కూడా ఎంతో ముఖ్యమైనది.

ఎటిఈఎస్ ద్వారా అత్యవసర సిద్ధత, ట్రామా వ్యవస్థల అభివృద్ధి, ప్రీ–హాస్పిటల్ కేర్ మెరుగుదల ప్రతి సెకను కీలకమైన సమయంలో ప్రతి రోగికి సమయానికి ప్రాణరక్షణ సేవలు అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు.అమర హాస్పిటల్ అత్యవసర వైద్య సేవల అభివృద్ధికి ఇన్నోవేషన్, ట్రైనింగ్, మల్టీడిసిప్లినరీ సహకారం, సిమ్యులేషన్ ఆధారిత విద్య, ట్రామా సిస్టమ్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ ఫోకస్డ్ ఎమర్జెన్సీ ప్రిపేర్డ్నెస్ కార్యక్రమాల ద్వారా నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించింది. ప్రపంచవ్యాప్తంగా ఎమర్జెన్సీ మెడిసిన్ డేను అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి అత్యవసర పరిస్థితుల్లో సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని గౌరవించడానికి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎం. వి. ఐ. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్.. ముస్లింలకు శుభాకాంక్షలు

## - ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి



**పీలేరు–ఆంధ్రనాడు,మే 27 :** త్యాగం, సహనం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పీలేరు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులు, వారి కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. అల్లా దయతో అందరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు. పీలేరు నియోజకవర్గంలో అన్ని మతాల ప్రజలు సోదరభావంతో మెలగడం గర్వకారణమని, ఈ బక్రీద్ పండుగ మరింత ఐక్యతను పెంచాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముస్లిం సోదరులందరికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# తిరుచానూరులో వృద్ధుడు అదృశ్యం.. సిఐ సునీల్ వెల్లడి



**తిరుపతి–ఆంధ్రనాడు,మే 27 :** తిరుపతి జిల్లా తిరుచానూరులో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా బంట్వారం గ్రామం అదే మండలానికి చెందిన మంగలి పాపయ్య (72) తన కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి దైవ దర్శనం నిమిత్తం తిరుచానూరుకు వచ్చారు. ఈ నెల 25వ తేదీ ఉదయం సుమారు 5 గంటల సమయంలో కాలకృత్యాల కోసం వెళ్లిన ఆయన అప్పటి నుంచి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వారు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ బి. సునీల్ కుమార్ (9440796755), ఎస్సై టీవీ సుధాకర్ (9491074536)లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగిద్దాం అంటూ అంగరంగ వైభవముగా మహానాడు మహోత్సవం






**పుంగనూరు –ఆంధ్రనాడు,మే 27:**పుంగనూరు పట్టణరూరల్ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుజన్మదిన సందర్భంగా ప్రతి ఏటా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాలు అంగరంగ వైభవముగా 27 28 29 తేదీలలో మూడు రోజులు పాటు ఆనవాయితీగా నిర్వహించడం విధితమే ఈ సంవత్సరం పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఆయా నియోజకవర్గం పరిధిలో గల క్లస్టర్ల పరిధిలో మినీ మహానాడులను అంగ రంగ వైభవముగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు, పుంగనూరు నియోజకవర్గంలో అన్ని మండలా లలో క్లస్టర్ల పరిధిలో ఆ మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పట్టణ పరిధిలో ఇన్చార్జుల ఆధ్వర్యంలో, తెలుగుదేశం పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని మహానాడు ను నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నందమూరి తారక రామారావకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మహానాడు ను విజయవంతం చేసినందుకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో పుంగనూరు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి యాదవ్, రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి, పాలడుగు రెడ్డప్ప నాయుడు, పుంగనూరు పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు సివిరెడ్డి, రామకృష్ణంరాజు, మండల ముఖ్య నాయకుడు మాధవరెడ్డి, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, లాయర్ వెంకట మునియాదవ్, మాజీ డిఎస్పి సుకుమార్, మాజీ ఎంపీపీ రత్నమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాలినేని కవిత, పుంగనూరు మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, సీనియర్ నాయకుడు చదల్ల వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు అంజిరెడ్డి, రాష్ట్ర కల్చరల్ ఉపాధ్యక్షుడు యాదవ్, రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి పర్వీన్ తాజ్, ముస్లిం మైనార్టీ నాయకుడు, షామీర్ లాల్, మాజీ కౌన్సిలర్లు , దేశాధి ప్రకాష్, చంద్ర పుంగనూరు మండల రైతు విభాగ నాయకుడు జగన్నాథం యాదవ్, క్లస్టర్ ఇన్చార్జులు నాగరాజా, గంగాధర్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మనీ కుమ్మరి గుంట, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# గ్రామ సీమల్లో ప్రారంభమైన పసుపు పండగ

## మహానాడు కార్యక్రమానికి తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు







**రామకుప్పం- ఆంధ్రనాడు, మే 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు ప్రవేశపెట్టిన తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం పండుగను మహానాడుగా చేస్తున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఆదేశానుసారం ఇంధన పొదుపు పాటించాలన్నారు దీనికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి మహానాడు ను గ్రామ సీమలోనే నిర్వహించాలన్నారు దానిలో భాగంగా బుధవారం రామ కుప్పంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి కెపిఎం యుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు తెలుగుదేశం నాయకులు పూలమాలలు వేసి మహానాడుకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు రామకుప్పం అనిగనూరు గ్రామాలలో తెలుగుదేశం క్లస్టర్ ద్వారా మహానాడు కార్యక్రమాన్ని చేశారు అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని అట్టడుగు వర్గాల ప్రజలు అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టాడని దాని ద్వారా సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రత్యేక కార్యక్రమం రూపొందించి నారన్నారు దాంతోపాటు పి 4 ద్వారా నిరుపేదలను గుర్తించి వారికి జీవన విధానం కోసం అనేక రకాలుగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కే పి యం యూడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునుస్వామి రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ మాజీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఆంజనేయ రెడ్డి రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ సింగల్ విండో అధ్యక్షులు మహ్మద్ రఫీ క్లస్టర్ ఇన్చార్జులు రవి రెడ్డి నాగభూషణం తెలుగుదేశం పార్టీ నాయకులు గంటల గౌడు సీతాపతి, చిన్ని కృష్ణ, టీవీ రవి,పత్ర నారాయణ చంద్ర రెడ్డి మంజునాథ్ రెడ్డి బాలసుబ్రమణ్యం సుబ్రి రఘు మంజునాథ్ రామమూర్తి జయశంకర్ ఇంకా పలువురు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్టీఆర్

## - మహానాడు వేళ కొనియాడిన టిడిపి నేత నాగూర్ వలి



**మదనపల్లి –ఆంధ్రనాడు, మే 27:** తెలుగువారి ఆత్మగౌరవం పేరిట తెలుగుదేశం పార్టీని స్థాపించి సుపరిపాలన అందించిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని ఆర్టీసీ డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి (షో ఆప్ శీనా) పేర్కొన్నారు.బుధవారం 7వ క్లస్టర్ ఇంచార్జ సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో సుభాష్ రోడ్డు లోని పరిణయ ఫంక్షన్ హాల్ నందు మహానాడు వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఆయనతోపాటు ఎన్టీఆర్ విగ్రహానికి నాగూర్ వలి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ సమాజమే దేవాలయం –ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు.ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,టిడిపి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబులు పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ,రాష్ట్ర అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తున్నారని కొనియాడారు.క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగుదేశం పార్టీని తీర్చిదిద్దారన్నారు.

రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు,మదనపల్లి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు.మదనపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు మహానాడును పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్ తేజ,మాజీ కౌన్సిలర్ బాబు నాయుడు,పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex,
Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733